క్లుప్తంగా

శబరిమల యాత్రకు కొంకుదురు స్వాములు



కొంకుదురు నుంచి శబరిమల యాత్రకు బయలుదేరిన స్వాములు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న ఆశ్రమంలోని స్వాములు శబరిమల యాత్రకు ఆదివారం బయలుదేరారు. గురుస్వాములు చెల్లారెడ్డి, రుద్రం, లేఖర్ శ్రీను, చింతా శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో 47 మంది స్వాములు యాత్రకు పయనమయ్యారు. ముందుగా ఆలయం వద్ద ఇరుముడులు కట్టుకుని అయ్యప్ప నామస్మరణతో భజనలు చేస్తూ పర్యటన ప్రారంభించారు.

టెక్నికల్ కార్యదర్శిగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావును అభినందిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

రంగంపేట: ఏపీ ఎస్సీ, ఎస్టీ పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం టెక్నికల్ కార్యదర్శిగా రంగంపేట మండల పంచాయతీరాజ్ జేఈ కమ్మ సత్తి శ్రీనివాసరావు నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన సంఘం కార్యవర్గ ఎన్నికల్లో శ్రీనివాసరావు రాష్ట్ర టెక్నికల్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘంతో పాటు రంగంపేట మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు అభినందించారు.

టీడీపీ నాయకులపై కేసు

రంగంపేట: అనుమతులు లేకుండా ధర్నా చేసినందుకు గాను టీడీపీ నాయకులపై కేసు నమోదుచేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కేవీఎస్ నారాయణ ఆదివారం తెలిపారు. ఈ నెల 14వ తేదీ శనివారం మధ్యాహ్నం అనపర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30 మంది టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు రంగంపేట మండలం వడిశలేరు వద్ద ఏడీబీ రోడ్డుపై ఎటువంటి అనుమతులు లేకుండా ధర్నా నిర్వహించి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించారన్నారు.


సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో శ్రీసూర్యనారాయణమూర్తి స్వామి వారు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత శ్రీసూర్యనారాయణమూర్తి స్వామి వారి ఆలయంలో స్వామివారికి ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



మెగా వైద్య శిబిరంలో చిన్నారులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్

గోకవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆదివారం విజయవాడ బ్లాసమ్స్ హాస్పిటల్, స్థానిక సుప్రజ క్లినిక్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, దాసరి రమేష్ ప్రారంభించారు. చిన్నారులు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు బ్లాసమ్స్ ఆస్పత్రి డాక్టర్లు సీహెచ్ జ్యోతి, కె.మహాలక్ష్మి వైద్య పరీక్షలు చేశారు. సుమారు 400 మంది వైద్య సేవలు పొందినట్టు నిర్వాహకులు తెలిపారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు దాసరి తమ్మన్నదొర, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యులు పులపర్తి బుజ్జి, ముత్యం నాని తదితరులు వైద్య శిబిరాన్ని సందర్శించారు.

కరుణించగ రావమ్మా.. కనకదుర్గమ్మా

- వాడవాడలా ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు
- త్రిశక్తి పీఠంలో కలశ స్థాపన చేసిన ఎమ్మెల్యే దంపతులు



అనపర్తి త్రిశక్తి పీఠంలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు



ముత్యాలమ్మ ఆలయంలో లలిత సహస్ర నామ పారాయణ చేస్తున్న మహిళలు

అనపర్తి: శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు మండలంలోని గ్రామగ్రామాన ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలతో పాటు, గ్రామాల్లోని వివిధ కూడళ్ల వద్ద మండపాలు ఏర్పాటుచేసి అమ్మవారిని కొలువుదీర్చారు. భవానీ దీక్షాధారులతో గ్రామాలు ఎరుపు వర్ణ శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా భక్తులు సామూహిక కుంకుమ పూజలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనపర్తి గ్రామదేవత వీరుళ్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అమ్మవారి త్రిశక్తి పీఠంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు కలశ స్థాపన చేసి పూజలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులచే అర్చకులు గణపతి పూజ, అఖండ దీపారాధన జరిపించారు. మండలంలోని పొలమూరు దేవి సెంటర్ వద్ద వేంచేసివున్న విజయదుర్గా అమ్మవారి ఆలయంలో భవానీ మాలాధారులు అమ్మవారికి పూజలు జరిపారు. మండలంలోని రామవరం, కుతుకులూరు, పెదపర్తి, కొప్పవరం, మహేంద్రవాడ, లక్ష్మీనరసాపురం, దుప్పలపూడి, పీరారామచంద్రపురం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

బిక్కవోలు: బిక్కవోలు ప్రాచీన శ్రీగోలింగేశ్వరస్వామి వారి ఆలయంలో కొలువై ఉన్న శ్రీపార్వతీ అమ్మవారికి నవరాత్రా మహోత్సవాల సందర్భంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో గణపతి పూజ, చండీ యాగం నిర్వహించారు. బలభద్రపురం షిర్డి సాయినాథుని ఆలయం వద్ద చండీ యాగం నిర్వహించారు. పందలపాక వెలమపేట రామాలయం వద్ద శ్రీదేవి అమ్మవారి ఆలయంలో భక్తులు కలశస్థాపన చేశారు.

రంగంపేట: రంగంపేటలోని దేవీ సెంటర్ ఆలయంలో ఉదయం అభిషేకాల అనంతరం కలశస్థాపన, సహస్ర నామ కుంకుమార్చన చేశారు. అనంతరం అమ్మవారిని స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు నాగేంద్రశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కట్టుపొంగలి నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు, భవానీ మాలధారులు ఆలయానికి పోటెత్తి అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక కాత్యాయనీ సమేత శ్రీచంద్రశేఖరస్వామి ఆలయంలో తొలిరోజు అమ్మవారిని స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అలంకరించారు. ఉదయం అభిషేకాల అనంతరం అమ్మవారిని వెండి, బంగారు నగలతో అలంకరించారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. వడపప్పు, చలివిడి, పానకం, పులిహోర నైవేద్యంగా సమర్పించారు. దొంతమూరులో విజయదుర్గమ్మ ఆలయంలో గ్రామస్తులు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి కలశస్థాపన చేశారు. ఈలకొలను ముత్యాలమ్మ తల్లి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు.

బాలాత్రిపురసుందరీదేవిగా దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: పవిత్ర శరన్నవరాత్ర ఉత్సవాలు మండలంలో ఆదివారం ఘనంగా ప్రారంభయ్యాయి. గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో ఉదయం కలశస్థాపనతో ఉత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భవానీభక్తులు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత అమ్మవారికి అలంకరించే వెండి, బంగారు ఆభరణాలు, గజమాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి అలంకరించారు. స్థానిక వీరభద్రునిగద్దెలో దేవీనవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలోని కనకదుర్గమ్మ తొలిరోజు శ్రీబాలత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నేడు శ్రీగాయత్రీదేవి అలంకారం

శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ, వీరభద్రునిగద్దెలోని కనకదుర్గమ్మ వార్ల గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

సీతానగరం: దేవీ నవరాత్రుల ప్రారంభ మహోత్సవాల సందర్భంగా మండలంలోని గ్రామాల్లో గల ఆలయాలలో శ్రీ శ్రీకనకదుర్గ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం రాపాక పంచాయతీ పరిధిలోగల శ్రీరామనగరం వద్ద శ్రీకనకదుర్గ ఆలయం వద్ద దేవీ నవరాత్రుల మహోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొలకోటి శివప్రసాద్, వెంకట శ్రీలక్ష్మి దంపతులు కలశ పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. సీతానగరం వెలమపేట రామాలయంలో శ్రీకనకదుర్గ అమ్మవారిని నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, నాగరత్నకాలనీ, చినకొండేపూడి, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ళ, కూనగరం, వెదుళ్లపల్లి, ఇనుగంటివారిపేట, మునికూడలి, బొబ్బిల్లంక, కాటవరం, ములకల్లంక, మిర్తిపాడు, ఉండేశ్వరపురంలలో దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారి విగ్రహాలను నెలకొల్పి, ప్రత్యేక పూజలు జరిపారు.వలు గ్రామాల్లోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

రాజానగరం: నియోజకవర్గంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలతోపాటు జగన్మాత కొలువైవున్న ఇతర ఆలయాలల్లోనూ దసరా పూజలను సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. నియోజకవర్గంలో కాపవరం, గాడాల, గాదరాడ, దివాన్ చెరువు, పుణ్యక్షేత్రం, చక్రద్వారబంధం, తుంగపాడులలోని దేవి, శ్రీదేవి, రాజరాజేశ్వరి, కనకదుర్గ పేర్లతో ఉన్న అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించి, అదే స్థాయిలో నవరాత్రి ఉత్సవాలను కూడా ఘనంగా నిర్వహించనున్నారు. రాజానగరంలో రావుల చెరువు గట్టున ఉన్న కనకదుర్గ ఆలయం, పురాతన ప్రసిద్ధి చెందిన శ్రీరాజరాజేశ్వరి ఆలయంతోపాటు సాయిబాబా ఆలయంలో కొలువుతీరివున్న సరస్వతి మాతకు, గ్రామ దేవత ముత్యాలమ్మ వారి ఆలయం, చక్రద్వారబంధం దేవీచౌక్‌లోను శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయం, సాయంత్రం భక్తులచే కుంకుమ పూజలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా రాజానగరంలోని ముత్యాలమ్మ వారి ఆలయంలో లలితాసహస్ర నామ పారాయణను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.



పందలపాక వెలంపేట రామాలయం వద్ద కొలువైన శ్రీదేవి అమ్మవారు



చంద్రేడులో స్వర్ణకవచ అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు



రంగంపేట దేవీ సెంటర్ ఆలయంలో అమ్మవారు



బాలాత్రిపురసుందరీదేవిగా గోకవరం దేవీచౌక్ దుర్గమ్మ



శ్రీరామనగరంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పాలనలో మార్పు గమనించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బిక్కవోలులో గడప గడపకూ మన ప్రభుత్వం



బిక్కవోలులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పరిపాలనలో వచ్చిన మార్పును ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని బిక్కవోలులో ఆదివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఎమ్మెల్యేకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ పని జరగాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ప్రస్తుతం పరిపాలనను మీ గ్రామంలోకే తీసుకొచ్చామన్నారు. ప్రతిపక్షాలకు ఏం చెప్పాలో తెలియక ధరలు పెరిగాయని చెబుతున్నారన్నారు. రెండేళ్ల కరోనా కాలంలో ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాలు అందించారన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాల్లో కలిపి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని నేరవేర్చి ప్రజల మనసులు గెలుచుకున్నారని తెలిపారు. సంక్షేమ పథకాల అమలుతో గ్రామాల్లో పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం తపిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సర్రెళ్ల సుమలత, ఏఎంసీ మాజీ చైర్మన్ జంగావీర వెంకట సుబ్బారెడ్డి, ఉపసర్పంచ్ జంగా మురళీకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, గువ్వల సత్తిరెడ్డి, గొర్రెల రామకృష్ణ, వాసిరెడ్డి వాసు, యామన దుర్గారావు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ఆటో కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని అందిస్తూ, వారికి అండగా నిలుస్తోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా అన్నారు. దివాన్‌చెరువు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రాష్ట్రంలో చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ఆటో కార్మికుల కష్టనష్టాలను స్వయంగా చూశారని, ఆరోజు వారికి అండగా ఉంటానంటూ ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే ఆచరణలో పెట్టారన్నారు. గడచిన ఐదేళ్లలో వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా ఒక్కో ఆటో కార్మికునికి రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని అందించారని గుర్తు చేశారు. తన తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు నుంచి కుటుంబపరంగా తాము కూడా ఆటో కార్మికులకు చేదోడువాదోడుగా ఉంటున్నామన్నారు. ఏ సమస్య వచ్చినా నిర్భయంగా తన దృష్టికి తీసుకురావొచ్చన్నారు. దివాన్‌చెరువు గ్రామాభివృద్ధికి గత ప్రభుత్వాలు మోకాలు అడ్డితే తాము అధికారంలోకి వచ్చాక రోడ్లను విస్తరించడంతోపాటు పంచాయతీకి పక్కా భవనాలు నిర్మించామంటూ అభివృద్ధిని వివరించారు. ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్ అక్కిరెడ్డి మహేష్ కుటుంబానికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, వేమగిరి కృష్ణ, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అందరికీ రక్షిత నీరు అందించాలన్న లక్ష్యంతో..

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ప్రజల ఆరోగ్య సంరక్షణార్థం రక్షిత నీరు అందించాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయల ఖర్చు చేసి ఓవర్ హెడ్ ట్యాంక్‌లను నిర్మించామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం గాడాల, నిడిగట్ల గ్రామాల్లో ఓహెచ్ఆర్ ట్యాంక్‌లను ఎమ్మెల్యే రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి రక్షత నీరు అందించే కార్యక్రమంలో భాగంగా ఓహెచ్ఆర్ ట్యాంక్‌ల నిర్మించామన్నారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా గాడాలలో రూ.44 లక్షలు, నిడిగట్లలో రూ.52 లక్షలతో ఎస్సీ, బీసీ పేటలలో 60 వేల లీటర్లు సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంక్‌లను నిర్మించామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఓహెచ్ ఆర్ ట్యాంక్‌లు, పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రానున్న వేసవిలో నీటిఎద్దడి ఏర్పడకుండా, ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్యాంక్‌లను ప్రారంభించారు. అనంతరం దోసకాయపల్లిలో దసరా ఉత్సవాల సందర్భంగా శ్రీకనకదుర్గ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, మండల కన్వీనర్ గణేసుల పోశి, పార్టీ నాయకులు చాటపర్తి దుర్గారావు పాల్గొన్నారు.

గాడాలలో జనసేన అడ్రస్ గల్లంతు



జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి వచ్చిన వారికి పార్టీ కండువాలను మెడలో వేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- నియోజకవర్గం వైఎస్సార్ సీపీకి అడ్డా
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- వైఎస్సార్ సీపీలో చేరిన జన సైనికులు

మధురపూడి: నియోజకవర్గంలో జనసేన పార్టీ ప్రభావం క్రమేపీ తగ్గుతోందని, వైఎస్సార్ సీపీ తిరుగులేని శక్తిగా బలపడుతుందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గాడాలలో కొండపల్లి దుర్గారావు ఆధ్వర్యంలో జనసేన పార్టీకి చెందిన కన్నెం శ్రీను, మరో 30 కుటుంబాల వారు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పార్టీ కండువాలను మెడలో వేసి, స్వాగతం పలికారు. వీరి చేరికతో గాడాలలో జనసేన అడ్రస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందన్నారు. ఇదే పరిస్థితి త్వరలోనే నియోజకవర్గంలో కూడా ఆ పార్టీకి వస్తుందన్నారు. జనసేన పార్టీ కోసం అవిశ్రాంతంగా పనిచేసిన కన్నెం శ్రీను వంటి ఎందరో నేడు ఆ పార్టీ విధానాలకు విసుగుచెందుతున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలకు, చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ ఆకర్షితులవుతున్నారన్నారు. పేదలకు నివాస స్థలాలు పంచకుండా అడ్డంకిగా ఉన్న కోర్టు కేసుల చిక్కులను న్యాయపరంగానే అధిగమించి త్వరలోనే అర్హులైన వారందరికీ నివాస స్థలాలను అందిస్తామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. కర్రి నాగేశ్వర్రావు, నక్క రాంబబు, కంటే వినయ్‌తేజ, చాటమర్తి దుర్గారావు, మడికి గంగాధర్‌రావు, కొండపల్లి నాగేశ్వర్రావు, ఏలి మూర్తి పాల్గొన్నారు.

ముగిసిన కంప్యూటర్ కోడింగ్ శిక్షణ



శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

రాజానగరం: దివాన్‌చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ కార్యాలయంలో కంప్యూటర్ కోడింగ్ జావా ప్రోగ్రామ్‌పై శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. 40 మంది విద్యార్థులకు ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు సర్టిఫికెట్స్ అందజేశారు. ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి, డాక్టర్ వైఎస్ బాలు, సత్యకుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

'నన్నయ'లో అబ్దుల్ కలాం జయంతి



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు, తదితరులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వీసీ ఆచార్య కె.పద్మరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. క్షిపణి శాస్త్రవేత్తగా, భారత దేశ 11వ రాష్ట్రపతిగా దేశం కోసం ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని సమాజ హితం కోసం తమ సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సివిల్స్ విద్యార్థిని కోళ్ల జ్యోత్స్నకు రూ.7 వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఆదివారం దసరా సెలవుల సందర్భంగా ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు రవిచంద్ర గణితంలో మెళకువలు నేర్పారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ముందుగా రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు చలుమూరి సత్యనారాయణ, మతల రమేష్ పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

అనపర్తి: చేతుల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాష్‌డే దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని రామవరంలో సర్పంచ్ గంగాభవాని అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ చేతుల పరిశుభ్రతపై చిన్నారులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయితీ పరిధిలోని అన్ని ప్రభుత్వ విభాగాల ఉద్యోగులు గ్రామ సచివాలయాల వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పీవీ కృష్ణారెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



పెదపూడిలో పారిశుధ్య కార్మికులతో చేతులు శుభ్రం చేయిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: వ్యక్తిగత పరిశుభ్రతతో ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడిలో ఆదివారం అంతర్జాతీయ చేతులు శుభ్రం చేసే దినోత్సవం సందర్భంగా పారిశుధ్య కార్మికులతో చేతులు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా పలు వ్యాధులు దూరం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి మన్యం శ్రీనివాస్‌చౌదరి, వీఆర్వో చండి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.